# తాత్పర్యం

## రామా చంద్రమౌళి కథలు



# విషయసూచిక


1. దిగడానికి కూడా మెట్లు కావాలి
2. అతడు
3. కొన్ని జ్ఞాపకాలు... కొన్ని కన్నీళ్ళు
4. దుఃఖం సుఖం కంటే సుఖమా?
5. దృష్టి
6. పరిధి
7. ఒక తుఫాను... ఒక నగరం
8. 264 రోజుల జీవితం
9. సొరంగం
10. కొన్ని సముద్రాలు... రెండు కళ్ళు
11. ప్రమేయం
12. దృష్టిని బట్టి దృశ్యం
13. అమ్మగది
14. గడ్డితాడు
15. విజాతి మనుషులు వికర్షిస్తారు
16. మనిషి ఒంటరి... మనిషే సమూహం
17. అంటుకున్న అడవి
18. ఒక నిద్ర... ఒక మెలకువ
19. దుఃఖలిపి
20. తాత్పర్యం



# అతడు

మనిషి శరీరం ఒక బయో వాచ్. ఇరవై నాలుగు గంటల సమయానికి సెట్ చేయబడి.. ట్యూన్ చేయబడి.. అసంకల్పిత నియంత్రణతో దానంతటదే నడిచే ఒక జీవవ్యవస్థ. ఈ రోజు ఈ క్షణం ఏమి చేస్తావో.. రేపు మళ్ళీ అదే సమయానికి అదే పనిని చేయాలనే అదృశ్య కుతూహలం.. అదే సమయానికి నిద్ర.. అదే సమయానికి ఆకలి.. అదే సమయానికి సెక్స్.. అదే సమయానికి తాగుడు కుతి.. అదే సమయానికి అదే .. ఏదైనా.

అతడు.. రాజు.. ఇరవై రెండేళ్ళ రాజు ఎస్సెస్సీ నాల్గుసార్లు తప్పి, గవర్నమెంట్ టీచర్ ఐన అమ్మ నెత్తీ నోరూ బాదుకుని బలవంతంగా బతిలాడీ బతిలాడీ.. పంపితే.. ఇంటర్ ఎం.పి.సి.లో చేరి.. ఉహూ.. చదువు అబ్బని రాజు.. తర్వాత.. ఆవారా.. బొగ్గుబావుల సింగరేణి బెల్ట్ లోకంలో.. బెల్లంపల్లి.. మందమర్రి.. రామగుండం.. గోదావరి ఖని.. కళ్ళు విశాలమై.. చూపులు విస్తృతమై.. ఆకలి ఆవులిస్తూ.. వయసు విచ్చుకుంటూ.. శరీరం ఒట్టి తినడానికీ తాగడానికే కాదు.. ఇంకేవేవో పనులకు కూడా అని తెలుసుకుంటూ.. నరాల్లో ఒక్క రక్తమే కాదు.. కొంత అగ్నికూడా ఉంటుందని.. దేహం దేహమంతా ఒక నిప్పులకొలిమిలా దహించుకుపోతూ లోలోపల దాహంతో రగిలిపోతూంటుందని.. తెలుసుకుంటూ.. అప్పుడప్పుడు తెలియని 'దేని' కోసమో వెదుక్కుంటూ వెదుక్కుంటూ.. జవాబు

దొరక్క.. మెల్లమెల్లగా.. సారా.. విస్కీ.. బ్రాందీ.. ఏదిబడితే అది తాగి.. బానిసగా మారుతున్న రాజు,

ఎనిమిది గంటలు.. రాత్రి.. పొద్దుటినుండి ఒకటే వర్షం. ఎడతెగని వర్షం.. ముసురు కొద్దిసేపు.. మళ్ళీ చినుకులు ముదిరి జోరు వాన మరికొంతసేపు.

పైన రేకుల షెడ్‌పై పడ్తున్న చినుకుల చప్పుడు.. ఒక రిథం.. లయ..

ఎనిమిది కాగానే రాజు దేహమంతా దాహం దాహం.. బయో వాచ్ అరుస్తోంది.. అలారం మోగిస్తోంది.. మందు కావాలి.. ఎక్కడిదో అక్కడిది.. ఎవరో ఒకరితో.. ఏ రకంగానైనా సరే.. ఎలాగైనా సరే .. కొంత మందు కావాలి.. ఎలా.. ఎలా?

సరిగ్గా ఆ క్షణం మోగిందతని సెల్ ఫోన్.

"అరే రాజూ! రెడీయేనా? రానా నేను నీదగ్గరకు.. అక్కడే ఆ గూడ్స్ రేకుల షెడ్ దగ్గరే ఉన్నావు గదా!" రఫీక్ గాడు.

ప్రాణం లేచొచ్చింది రాజుకు. రఫీక్‌గాడైతే వెంటనే తప్పక మందు తీసుకుని వస్తాడు క్షణాల్లో. తెలుసు వాడికి తనకేమి కావాలో? చిన్ననాటి క్లాస్‌మేట్ వాడు. మొన్నటిదాకా నూకుడు బండిపై ఉల్లిగడ్డలమ్మే వాడు. గత నాల్గు నెలలుగా తనతోనే ఇదే పని.. బొగ్గు దొంగతనం. రఫీక్ అంటే మెరుపు తీగ.. రఫీక్ అంటే స్పైడర్ మ్యాన్ కంటే చురుకు.. గెంతు గెంతితే రైలు డబ్బాలను దాటుకుంటూ సినిమాల్లో కంటే వేగంగా.. ఒకటే పరుగు.. ఒకటే ఉరుకు.. కన్ను తెరిచి మూసేలోగా మటుమాయం.

"తొందరగా వచ్చేయ్ రా.. చాలా చలిగా ఉండి.. వెచ్చగా మందు కావాలి ప్లీజ్.."

"మందు సరే గానీ.. నువ్వు రెడే కదా! తొమ్మిదింబావుకు.. రైలు లక్ష్మీపురం.. యైటింక్లైన్ నడుమకు రాగానే .. హనుమంతుని గుడి ఇవతల.. అడ్డా. మొత్తం ముప్పై ఆరు మందిమి ఈ రాత్రి.. మొత్తం ఇరవై ఆరు టన్నులు డౌన్‌లోడ్ కావాలి. మంచి క్వాలిటీ బొగ్గు వస్తోంది ఎన్.టి.పి.సి.కి ఈ రాత్రి. రైలు హనుమంతుని గుడి దాటిన అరగంటలోనే మన మనుషులు చకచకా బొగ్గునంతా గోతాల్లో కుట్టి.. అరగంటలో లారీలకెక్కిస్తారు. తెల్లారేసరికి ఆరు లారీల్లో మొత్తం ఎనిమిది పాయింట్స్ నుండి అరవై ఆరు టన్నుల బొగ్గు బాలానగర్ ఫౌండ్రీకి



# దుఃఖం సుఖంకంటే సుఖమా?

ఆమె సుభద్రేనా.?

మనసు పదే పదే తరచి తరచి వెదుకుతోంది.. జ్ఞాపకాన్ని.. రెండు నిముషాల క్రితం గబగబా మెట్లెక్కుతూ ఎటిఎంలోకి వస్తున్నప్పుడు కనబడ్డ ఆమె రూపురేఖలను మరోసారి మననం చేసుకుంటూ.

దాదాపు నలభై సంవత్సరాల క్రితం కనుమరుగైన సుభద్ర.. మళ్ళీ అనూహ్యంగా.. ఇప్పుడు ఇలా కనబడే అవకాశం ఉందా?

ఒకవేళ ఆమె సుభద్రే ఐతే.. ఇన్నాళ్ళు ఎక్కడుందో? ఎక్కడో ఉంటే ఇప్పుడెందుకొచ్చిందో? వస్తే.,

సుభద్ర.. సుభద్ర.. మనసు ఒక్కో జ్ఞాపకపు పొరను ఛేదించుకుంటూ వెనక్కి.. ఇంకా వెనక్కి.. లోలోతులకు.,

అప్రయత్నంగానే గాజు తలుపుల్లోంచి వెనక్కి, రోడ్డు ప్రక్కన పార్క్ చేసి ఉన్న నా కారు దిక్కు చూశాను మళ్ళీ.. ఫుట్‌పాత్ ప్రక్కనే నిలబడి ఉంది అలాగే. తలపైనుండి చీర కొంగు. ముఖం కనబడ్డంలేదు. అటువేపు కారు దిక్కు తిరిగి ఉందామె.

ప్రాసెస్ ఐపోయి ఎటిఎం మెషీన్ బర్ ర్ ర్ మని చప్పుడు చేసి నోట్లను బయటికి నెట్టింది చీలికలోనుండి. వెంటనే ఏదో మూతబడిన ధ్వని. ప్రక్కనున్న విండోనుండి చప్పున బయటికి తన్నుకొచ్చిన స్లిప్.

అప్రయత్నంగానే నోట్లను లెక్కపెట్టుకుంటూ.,

ఇరవ ఒక్క ఐదువందల రూపాయల నోట్లు. ఐదు వందరూపాయల నోట్లు.

జేబులో పెట్టుకుంటూ,

ఆతురతగా వెనక్కి తిరిగి.. మళ్ళీ కారు దిక్కు చూపు.

అక్కడే ఉందామె.

కొంచెం చీకటి చిక్కబడ్డది. వీధి లైట్లు వేసినట్టున్నారు అప్పుడే.. పల్చగా తెల్లని కాంతి రోడ్డుపై పర్చుకుంటూ,

అసలారోజు తెలంగాణా బంద్. పొద్దంతా దుకాణాలన్నీ మూసేయబడే ఉన్నాయి. సాయంత్రం ఆరవుతూండగా అక్కడొకటి అక్కడొకటి దుకాణాలు తెరుచుకుంటూ.,

కరూర్ వైశ్యా బ్యాంక్ ఎటిఎం నుండి బయటికొచ్చి నిర్మలా కాంప్లెక్స్ లాంజ్‌లో నిలబడి.. పరిశీలనగా, స్పష్టంగా నా కారు దిక్కూ, నేను సుభద్రగా భావిస్తున్న ఆ మనిషి దిక్కూ నిలకడగా చూస్తూ,

శీతాకాలం.. జనవరి నెల.. పొద్దంతా దట్టంగా మబ్బుపట్టిన ఆకాశం.. ఇక సూర్యుడస్తమించగానే చలి.. ఆకాశం అన్ని అంచులనుండీ చలి ఒక జలవలె ముంచుకొస్తున్నట్టు.. చల్లగా గాలి విస్తరణ. ఒళ్ళు వణుకుతున్నట్టు జలదరింత. జేబుల్లోకి చేతులు వెళ్ళిపోయేయి అప్రయత్నంగానే. సన్నని పొగమంచు కూడా గాలిలో తేలివస్తున్నట్టు పల్చని తెర పరిసరాల నిండా.

సుభద్ర జ్ఞాపకం అప్పుడే అంటుకున్న కాగడాలా మెదడు లోపల ఎక్కడో మండుతూ.,

వెళ్ళిపోయాను నలభై సంవత్సరాల వెనక్కి.

ఏదో తెలియని భారం హృదయం నిండా.. తుఫాను.. గాలివాన.. బీభత్సం.. లోపల.



# ఒక తుఫాను.. ఒక నగరం.. ఒక మనిషి

డాక్టర్ హెచ్. సూర్యుడు. ఎం టెక్, పి హెచ్ డి.. మెకానికల్ ఇంజినీరింగ్.. ఐఐటి ఖరగ్‌పూర్ నుండి. పదేళ్ళక్రితం.

తర్వాత.. వేట.. ఉద్యోగంకోసం వేట.. వృత్తి తృప్తి కోసం వేట.. తనలో నిక్షిప్తమై జ్వలించే అధ్యయనాల తాలూకు పరిశోధనలూ.. నూతన ఆవిష్కరణలూ.. ఆలోచనలూ.. హైపొథిసిస్ తాలూకు దాహానికి సంబంధించిన తృప్తికోసం వేట.

వేట.. వెదుకులాట.. అన్వేషణ.. ఫలించాయా?

ప్చ్.

మనిషి లోపల కణకణలాడే నిప్పుకణికలా నిత్యం జ్వలించే శోధనాకాంక్ష.. ఒక సముద్రమా?

ఒక ఆకాశమా.?

ఒక అనంతానంత శూన్యమా?

హుద్ హుద్ తుఫాన్ రాబోతోందని హెచ్చరిక.. బంగాళాఖాతమంతా బీభత్స కల్లోలం.

సూర్యుడు.. ఒంటరిగా.. నక్కవానిపాలెం.. మున్సిపల్ స్కూల్ ప్రక్కన.. నాల్గంతస్తుల మేడపైనున్న పెంట్ హౌజ్‌లో,

రాత్రి.. తొమ్మిది దాటుతూండగా,

టేబుల్‌పై ముడుచుకున్న చేతులపై ముఖాన్ని దాచుకుని దాచుకుని.. కళ్ళు మూసుకుని మూసుకుని,

మూసిన కళ్ళనిండా చీకటి.

కళ్ళు మూస్తే ఎప్పుడైనా చీకటే.

కాని కళ్ళు తెరిస్తే మాత్రం ఎప్పుడైనా వెలుతురు కాదు. అప్పుడప్పుడు వెలుతురు.. అప్పుడప్పుడు చీకటి.

ఎవరో కవి అన్నాడు.. "చీకటే శాశ్వతం.. వెలుతురే అప్పుడప్పుడు వచ్చిపోయే అతిథి" అని. నిజమేనా?

చీకటి వెంట వెలుతురు.. వెలుతురు వెంట చీకటి.. ఒక నిరంతర వేట.

తుఫానుగాలి గంటకు రెండు వందల కిలోమీటర్ల వేగంతో.. ఒకటే వికృతమైన హోరు. కోటిమంది భీకర రాక్షసులు ఒకే చోట నిలబడి విశాఖ నగరంపై హూంకరిస్తూ అరుస్తున్నట్టు.. చెవులు పగిలిపోతాయా అన్నట్టు భరించలేని వికృత శబ్దం.

చెవులను గట్టిగా మూసుకున్నాడు సూర్యుడు శబ్ద బీభత్సాన్ని భరించలేక.

బయట చెట్లు ఊగి ఊగి ఫెళఫెళా కూలిపోతున్న చప్పుడు. పూరిండ్ల కప్పులు, రేకులు, దుకాణాల ఆచ్ఛాదనలు, హోర్డింగులు అన్నీ ఒట్టి అట్టముక్కల్లా గాలిలో లేచిపోతున్న ధ్వని.

ఎత్తైన భవనాలన్నీ కూలి నేలమట్టమైపోతాయా? సముద్రం ఆకాశమంత ఎత్తుతో నగరంపై విరుచుకుపడి సమూలంగా ధ్వంసించి సర్వాన్నీ నిశ్శేషం చేస్తుందా?

చివరికి అసలిక్కడ ఈ నగరపు ఆనవాళ్ళేమైనా మిగుల్తాయా?

మొత్తం శ్మశానమై ఒక శవాల దిబ్బ మిగుల్తుందా?

ఏమో!

మోచేతులపైనుండి తలెత్తిన సూర్యుడికి అప్పటినుండి టేబుల్‌పై పరిచి ఉన్న మూడు ప్లాస్టిక్ అక్షరాలు కనిపించాయి. వాటిని అప్పుడు సాయంకాలం తన పిహెచ్‌డి థీసిస్ కోసం గత నాల్గు రోజులుగా ఎడతెరిపి లేకుండా తన చుట్టూ



# కొన్ని సముద్రాలు.. రెండు కళ్ళు

'అనంతకాలంనుండి అన్వేషిస్తున్నాను..

విశాల మహా సముద్రాలను.. అట్లాంటిక్‌లనూ.. పసిఫిక్‌లనూ

కాని నిన్ననే కనిపించాయి అతిలోతైన రెండు సముద్రాలు నా సమక్షంలోనే..

అవి.. నా దోసిట్లో వికసించిన నీ ముఖారవిందంలోని రెండు కళ్ళు–

తనకు ఎంతో ఇష్టమైన గజల్ అది. హైదరాబాద్‌కు చెందిన మషూర్ గజల్ గాయకుడు విఠల్‌రావు పాడుతాడది.. పాతలో లీనమైపోయి. మమేకమైపోయి. మనిషి సింపుల్.. అతి సాధారణం.. ఒక చవక రకపు లాల్చీ.. పైజామా.. అంతే.. ఒకప్పుడు నిజాం నవాబు తన గుఱ్ఱపుబండి బగ్గీని ఇంటికి పంపించి విఠల్‌రావును తన మహల్‌కు రప్పించుకుని గంటలకు గంటలు గజల్స్‌ను వినే మధుర గాయకుడు.

"ఎందుకు సర్.. మీరు మరీ ఇంత సింపుల్‌గా ఉంటారు.. కొంచెం.." అని తనడిగేవాడు.

ఆ క్షణం విఠల్‌రావుగారు.. తలెత్తి.. తనవైపు చూచే చూపు.. నిప్పులా కాల్చేది.. అనేవాడు.. "బేటా.. ఈ పటాటోపాలన్నీ ఒట్టి బూటకం బిడ్డా.. వచ్చేటప్పుడు మన వెంట రానివీ.. వెళ్ళేటప్పుడూ మనవెంట రానివీ.. చోడ్ దో ఏ సబ్.. అతీత్

హొజావ్.. గెట్ లిబరేటెడ్..” తర్వాత ఒట్టి మౌనం. వెంటనే మళ్ళీ తనదైన ఒక మధుర మహోన్నత గజల్ ప్రపంచంలోకి నిష్క్రమించేవాడు. భౌతికంగా ఉంటాం.. కాని అభౌతికంగా మనదైన మనకు ఆత్మసంతృప్తినిచ్చే ఒకానొక జీవవ్యాపకంలో మనం సమాధియైపోయి జీవిస్తాం. అది జీవైక్య పారమార్థిక స్థితి.. అని చెప్పేవాడు. యోగి అతను.

నిన్న రాత్రంతా హైదరాబాద్‌లోని తను కిరాయికుంటున్న డాబా టెర్రస్‌పై.. చాపమీద వెల్లగిలా పడుకుని ఇంకా రాని చంద్రునికోసం నిరీక్షిస్తూ.. నీలాకాశంలోకి చూస్తూ చూస్తూ.. అదే గజలదే పునః పునః మననం.. తదియ.. చంద్రుడెక్కడున్నాడో.. లా పతా.

జీవితమంతే.. లోపల అగ్నిలా ఆత్మో.. హృదయమో.. ప్రజ్వలించే ఆత్మాంతర జీవమో.. గుప్తంగా.. అజ్ఞాతంగా.. రహస్యంగా దాగిఉంటుంది.. కాని బయటి ప్రపంచానికది అస్సలే కనబడక.. ఒక నిప్పుకణికలా.. మిణుకు మిణుకు. కాలుస్తూ.. ప్రకాశిస్తూ.. వెలుగుతూ.. అప్పుడప్పుడు దహించబడ్తూ,

మనిషి దహించబడ్తాడు.. లోపలినుండీ.. బయటినుండీ కూడా.

కాపాడుకోవాలి మనిషి తననుతాను.. ఈ దహించే అగ్నినుండి.. ముంచెత్తే సకల సామాజిక కాలుష్యాలనుండి.. కోరికలుగా, వ్యామోహాలుగా, బలహీనతలుగా ప్రతిక్షణం దాడిచేసే రుగ్మతలనుండీ.,

ఆటో.. ఆ ఏడుగంటల రాత్రి వేగంగా వచ్చి.. వచ్చి వరంగల్లు నగరం.. హంటర్ రోడ్‌లోని.. ఆ పేద్ద ప్లాస్టిక్ కాగితాలతో నిర్మించిన షెడ్డు ముందాగింది.. హైదరాబాద్ నుండి బస్సులో దిగి వస్తూండగా ఆటోలోనుండి చాలా పరిశీలనగా చూశాడు తను.. కాకతీయ మెడికల్ కాలేజ్ నుండి ఎంజిఎం మూలవరకు.. అన్నీ క్రిక్కిరిసిన గణనాథుల విగ్రహాలే.. పెద్దవి వరుసగా.. చాలా పెద్దవి.. మామూలు సైజ్‌వి.. చిన్నవి. కొన్నింటిపై ప్లాస్టిక్ కాగితాలను కప్పి.. ఎవ్రీ థింగ్ ఈజ్ ఫర్ సేల్.

ప్రతి విగ్రహమూ అమ్మబడును. ఎవరికి.. ఎంతకు.. ఎప్పుడు.. అమ్మబడును.

జవాబేమిటంటే.. ఎవరికైనా.. ఎంతకో ఒకంతకు.. ఈ రోజో.. కనీసం రేపు ఉదయం పదిగంటలవరకో తప్పకుండా అమ్మబడును. విగ్రహాల రేట్ ఈ క్షణం నుండి అప్ ట్రెండ్.. పైపైకి. ఉదయం.. వినాయక చవితి పండుగ..



# దృష్టిని బట్టి దృశ్యం

"నాన్నా! వీనికేదైనా మంచి పేరు సూచించండి" అంది డాక్టర్ దుర్గ. అప్పుడు నగరంలోనే అతి పెద్ద వ్యాపారవేత్త.. దుర్గ భర్త నీలకంఠం కూడా అక్కడే ఉన్నాడు ప్రక్కన. అదొక అతిపెద్ద కార్పొరేట్ దవాఖాన. దుర్గ తండ్రి వెంకటశేషయ్య దుర్గవైపూ.. అల్లుడు నీలకంఠం వైపూ నిరామయంగా చూచి అన్నాడు "ఊర్కే ఏదో మర్యాదకోసం అడిగి.. నేనేదో చెప్పగానే విని.. పెదవి విరిచి.. మళ్ళీ మీకు నచ్చిన పేరేదో మీరు పెట్టుకుంటే అది నన్నవమానించి నట్టవుతుంది.. నేను చెప్పను" అని.

"ఫరవాలేదు.. చెప్పండి నాన్నా.. మీరు చెప్పిన పేరే పెడదాం వీడికి" అంది దుర్గ భర్తవైపు కూడా చూస్తూ.

వెంకటశేషయ్య వెంటనే అన్నాడు.. "ఐతే.. వీని పేరు హనుమ" అని.

అందరూ ఆశ్చర్యపోయారు.. అది.. పాతగానే అనిపిస్తూ.. కొత్తగా కూడా.. గంభీరంగా.. గొప్పగా.,

హనుమ.. హనుమ.. అలా ఖరారైపోయింది.. ఆ పేరు ఆ శిశువుకు.

తర్వాత.. యధావిధిగానే నీలకంఠం వెళ్ళిపోయాడు.. తన అతి విశాల వ్యాపార సామ్రాజ్యంలోకి. అతని దృష్టిలో మనిషి జీవితం అతి చిన్నది. విలువైంది..

మనిషికి భగవంతుడిచ్చిన వరం. ఒక్కసారే లభించే మహదావకాశం. కాబట్టి ఒక్క క్షణంకూడా వృథా చేయకుండా జీవితాన్ని కసిగా జీవించాలి. కసిగా అనుకున్నదాన్ని సాధించాలి. లక్ష్యాలనూ, గమ్యాలనూ చేరి విజయాలను స్వంతం చేసుకోవాలి.. అతని దృష్టిలో జీవితమంటేనే వ్యాపారం.. లేదా వ్యాపారమే జీవితం. అందుకే.. ఎన్నో రంగాల్లోకి ప్రవేశం.. రకరకాల విస్తరణలు.. విద్య.. వైద్య.. నిర్మాణ.. భూ క్రయ విక్రయ.. కాంట్రాక్ట్.. పెట్రోలియం.. ఎగుమతులు.. దిగుమతులు.. ఎన్నో.. కళ్ళు మూసుకుంటే.. దిమ్మ తిరిగిపోయే లావాదేవీలు.. అంతా కోట్ల రూపాయల్లో బేరం.

"బాగుంది మామగారూ.. మంచి పేరు.. ఈ క్షణం నుండి.. వీడు హనుమ.. వినూత్నమైన పేరు.. థాంక్స్" అని లేచాడు నీలకంఠం. లేచి బయటున్న ఆడి క్యూ ఫైవ్ కారెక్కి వెళ్ళిపోయాడు.. తైవాన్‌కు.. ఒక అంతర్జాతీయ వ్యాపార ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు. ఆరువందల ఇరవై కోట్ల డీల్ అది. తర్వాత కొద్ది నిముషాలకే డాక్టర్ దుర్గ.. నగరంలో ప్రఖ్యాత గైనకాలజిస్ట్.. ఐన తనే ఒక తల్లై.. తండ్రివంక చూస్తూ.. ఒక నాల్గురోజుల్లో.. నేను హాస్పిటల్ పనుల్లోకి వెళ్ళి పోవాలి నాన్నా.. వీని.. ఈ హనుమ పాలన.. పోషణ.. అన్నీ మీరూ, అమ్మే చూచుకోవాలి. చూస్తున్నారు గదా.. మీ అల్లుడుగారు ఈ క్షణమిక్కడ.. మరుక్షణ మెక్కడో.. ఏ దేశంలోనో.. ఒక రకంగా నేనూ అంతే.. ఒక విజిటింగ్ ప్రొఫెసర్‌గా.. ఐదు కార్పొరేట్ హాస్పిటల్లలో విజిటింగ్ డాక్టర్‌గా..హూ.. ఈ జీవితమింతే.. మీరే ఇప్పుడు వీడికి తల్లీ తండ్రీ.. తాతయ్య.. అమ్మమ్మ..అన్నీ." అంది.

డాక్టర్ దుర్గ అంటున్నదంతా సత్యమేనని తెలుసు వెంకటశేషయ్యకు.

నవ్వాడాయన.. ముసిముసిగా.. గంభీరంగా.. లోతుగా కూడా.

నవ్వి.. "మనిషి అంతిమంగా.. తనకు ఏమి కావాలో తెలుసుకుంటూనే.. ఏది వద్దో.. ఏది కూడదో కూడా తెలుసుకోవాలి తల్లీ!" అన్నాడు.

ఆ క్షణం డాక్టర్ దుర్గ చాలా నిస్సహాయంగా.. దీనంగా తండ్రివంక చూచింది.

సరిగ్గా అప్పుడే ఆమె ప్రక్కలో అప్పటిదాకా నిద్రిస్తున్న హనుమ కళ్ళు తెరిచి తన తాతయ్య వంక నిర్మలంగా చూస్తూ చిన్నగా నవ్వాడు.. బోసినోరుతో.

❄ ❄ ❄



# తాత్పర్యం

'చదువు వల్ల జ్ఞానం లభిస్తుంది. కాని జీవితం కేవలం జ్ఞానం వల్లనే సాఫల్యం కాదు. మనిషి విజయాలను హస్తగతం చేసుకోవాలంటే వాడికి ఊహాశక్తి ఉండాలి. జ్ఞానం కంటే ఊహాశక్తి గొప్పది. జ్ఞానికి హద్దులుంటాయి కానీ ఊహాశక్తి ఎల్లలు లేనిది' ఐన్‌స్టిన్ అంటున్నాడు చేతిలో ఉన్న పుస్తకంలో.

నలభై ఆరేళ్ల నిర్మల చేతిలోని పుస్తకాన్ని ఎదపై పెట్టుకుని ఆలోచిస్తోంది.

ఎదురుగా గడియారం.. ఐదు గంటలా పది నిముషాలు.

'తెల్లవారుతోంది.'

కిటికీలోనుండి పల్చని వెలుతురు ఛాయలు కనిపిస్తున్నాయి.

ఎవరో కవి అన్నాడు.. 'నిజానికి చీకటే శాశ్వతమైంది.. వెలుతురే మధ్య మధ్యలో వచ్చిపోయే అతిథి' అని. నిజమేనేమో.. మనిషి కష్టసుఖాలు చీకటి వెలుగుల్లాంటివే కదా. ఎవరి జీవితాల్లోనైనా అన్నీ కష్టాలే, అన్నీ సుఖాలే ఉంటాయా?

పిచ్చుకల కిచ కిచ చప్పుడు మొదలై క్రమంగా ఎక్కువౌతోంది. పిలుస్తున్నాయి అవి తనను. జీవుల మధ్య భాషకందని అతీత భాష ఒకటుంటుంది. అది జీవ భాష. లిపి ఉండదు.. వ్యక్తీకరణకు లొంగదు. హృదయాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ ద్రవింపజేస్తుంది.. నిగ్రహాతీతమైన ఉద్వేగంతో 'రీచార్జ్' చేస్తూంటుంది ఎప్పటి

కప్పుడు. కొన్నేళ్ళుగా ఈ పిచ్చుకలకూ, తనకూ మధ్య ఉన్న బంధం ఈ ఏ భాషకూ అందని హృదయ భాషేనా.

ఎన్నేళ్ళు..?

దాదాపు ఇరవై రెండేళ్ళయిందేమో. తమ పెళ్ళైన కొత్తలో.. ఆయనకు ఈ ఊరికి ట్రాన్స్‌ఫరై వచ్చి.. కొత్తగా కాపురం. అప్పటినుండి.. ఇదే ఇల్లు.. ఇదే గది.. ఇవే గోడలు.. ఇదే వాకిలి.. ఇవే చెట్లు.. ఇవే పిచ్చుకలు.. అవే కిచకిచలు.

నిర్మల లేచి గుండెలపై ఉన్న పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని ప్రక్కనున్న టీపాయ్‌పై పెడుతూ ప్రేమపూర్వకంగా అట్టపైకి చూచింది. అది కె.ఎన్.వై. పతంజలి రాసిన 'గెలుపు సరే ... బతకడం ఎలా?' అన్న చిన్న వంద పేజీల పుస్తకం. రాత్రి నుండి దాన్ని రెండు మూడుసార్లు చదివిందామె. ఊపిరందక మరణశయ్యపై ఉన్న రోగికి ఆక్సిజన్ అందుతున్నప్పటి పునర్జన్మానుభూతి కలుగుతోంది.

'జీవితమంటే యుద్ధం కాదు.. నిరంతరం యుద్ధం చేయడం జీవితావసరం.. శత్రువుల్ని మన ప్రయోజనాలకోసం వాడుకోవాలి. లేదా వాడికి తాత్కాలికంగా లొంగిపోయి, చేతిలో కత్తితో వాడ్ని వెన్నంటి తిరగాలి. లేదా వాడ్ని మన గుంపులో కలిపేసుకుని వాడ్ని మన వీపు వైపు రాకుండా చూసుకోవాలి' అంటాడు పతంజలి.

మన శత్రువు ఎంతటివాడో మనకు సరైన అంచనా ఉండాలి. ఒకవేళ వాడు యుద్ధ ట్యాంకరైతే మనం వెంటనే సీతాకోకచిలుకై పోవాలి. సీతాకోక చిలుకల్ని ట్యాంకర్లు ఏమీ చేయలేవు. సీతాకోకచిలుకలు కూడా ట్యాంకర్లను ఏమీ చేయలేవు. అప్పుడేమౌతుంది. యుద్ధం డ్రా ఔతుంది. ఐతే మనమే ఆ ట్యాంకర్ స్థానంలో ఉండి, మన శత్రువు సీతాకోకచిలుక స్థానంలో ఉంటే, అప్పుడు యుద్ధం డ్రా అవ్వదు. ఎందుకంటే మనం ట్యాంకర్ రూపంలోనుండి తొండ రూపంలోకో, గోరింక రూపంలోకో మారిపోతే సీతాకోకచిలుక మన నోటికి ఆహారంగా దొరుకుతుంది. శత్రువుల కళ్ళు కప్పడంకోసం సైన్యంలో 'కామెప్లాజ్' దుస్తులుంటాయి. వాటిని సందర్భాన్ని బట్టి రూపం మార్చుకోడానికి ఉపయోగిస్తారు. అవసరాన్ని బట్టి రూపం మార్చుకోవడం అనేది బతుకుదెరువు కోసం తెలుసుకోవాల్సిన అతి ముఖ్యమైన విద్య. యుద్ధంలో నూటికి నూరుపాళ్ళు గెలవాలంటే నువ్వు ముందు నీ శత్రువును గుర్తించాలి. నీకా గ్రహింపు ఉన్న సంగతి ఎదుటివాడికి ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియడానికి వీల్లేదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Tatparyam**

* * *